అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

సంపుటి - 2 సంచిక -307 ఆదివారం 8 మార్చి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts




WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

## గద్దర్ సినీ అవార్డుల ప్రకటన



- చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ అవార్డు
- కమలహాసన్‌కు పైడి జయరాజ్ అవార్డు
- సుద్దాల అశోక్ తేజకు సినారె అవార్డు
- ఉత్తమ చిత్రంగా రాజు వెడ్స్ రాంబాయి
- ఉత్తమ ద్వితీయ చిత్రంగా దండోరా
- ఉత్తమ తృతీయ చిత్రరా ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో
- ఉత్తమ నటుడిగా నాగచైతన్య..
- ఉత్తమ నటిగా రష్మిక మందన్నా
- ఉత్తమ దర్శకుడిగా సాయిలు
- ఉత్తమ సంగీత దర్శకుడు - మార్క్ రాబిన్
- ఉగాది రోజు అవార్డుల బహుకరణ

2లో.




# మహిళల రక్షణ సమాజం బాధ్యత

### వారి కోసం ఎన్నో చట్టాలు తెచ్చాం
### ఆర్థిక స్వావలంబన కోసం అనేక పథకాలు అమలు
### మహిళా వేధింపులను నిలదీసే సమాజం రావాలి
### స్టాండ్ విత్ హర్ కార్యక్రమంలో సిఎం రేవంత్

**హైదరాబాద్,మార్చి 7.(జర్నలిస్ట్ వార్త):** మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. జేఎన్‌టీయూ ఆడిటోరియంలో 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమంలో సీఎం రేవంత్ పాల్గొన్నారు. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు తీసుకొస్తున్నాం. వారు ఆర్థికంగా బలపడాలనే ఆలోచనతోనే మహిళాశక్తి పథకం తీసుకొచ్చాం. మహిళలపై ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం ఉంది. వారి ప్రాధాన్యం గుర్తించి పార్టీలో పదవులు ఇస్తున్నాం. ఆర్టీసీలో వెయ్యి బస్సులకు మహిళలే యజమానులు.


మిగతా 2లో.



# వంటగ్యాస్ బాదుడు

### షాకిచ్చిన మోడీ సర్కార్
### గృహ వినియోగ సిలిండర్‌పై రూ.60
### వాణిజ్య సిలిండర్‌పై రూ.115 పెంపు

**న్యూఢిల్లీ :మార్చి 7.(జర్నలిస్ట్ వార్త):**కంద్రంలోని మోడీ ప్రభుత్వం వంటగ్యాస్ ధరలను భారీగా పెంచింది. ప్రజలపై భారీ భారం మోపింది. గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్‌పై రూ. 60, వాణిజ్య అవసరాలకు ఉపయోగించే సిలిండర్‌పై రూ. 115 మేర ధరలు పెంచింది. దీంతో దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వంటగ్యాస్ ధరలు ఆకాశాన్నంటాయి. పెరిగిన ధరలు శనివారం నుంచే అమల్లోకి వచ్చాయి. ఈ ధరల పెరుగుదల భారం సాధారణ ప్రజలతో పాటు చిన్న వ్యాపారులు, హౌటళ్లు, రెస్టారెంట్లపై పడనున్నది.



మిగతా 2లో.

## రాష్ట్రపతినే అవమానిస్తారా ?

### ఇది సిగ్గుచేటైన విషయంగా పరిగణిస్తున్నాం
### ముర్ముకు బెంగాల్‌లో అవమానంపై మమతపై మోడీ ఆగ్రహం



**న్యూఢిల్లీ,మార్చి 07 : -:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పశ్చిమబెంగాల్‌లో పాల్గొనాల్సిన అంతర్జాతీయ సంతాల్ కాన్ఫరెన్స్ వేదికను మార్చడం, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆ కార్యక్రమానికి గైర్హాజరు కావడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర స్థాయిలో స్పందించారు.

మిగతా 2లో.

# రైతుబంధు ఎప్పుడిస్తారు

### మూడు పంటలకని చెప్పి ఒక్కి కూడా ఇవ్వరా
### కరీంనగర్ జిల్లాలో పర్యటించిన హరీష్ రావు

కరీంనగర్**మార్చి 7.(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు ఇచ్చే తెలివి లేదా అని ప్రశ్నించారు. మూడు పంటలకు రైతుబంధు ఇవ్వాలని గతంలో ఆయన చెప్పారని.. కానీ ఇప్పుడు తన హయాంలో మూడు పంటలకు రైతుబంధు

మిగతా 2లో.



# త్వరలో రివర్స్ మైగ్రేషన్

### ప్రపంచ దేశాల అభివృద్ధిలో భారతీయుల పాత్ర
### ఎక్కడికి వెళ్లినా భారతీయ నిపుణులు కనిపిస్తారు
### గ్రీన్ ఎనర్జీలో స్వయం సమృద్ధితో పాటు, ఎగుమతికి అవకాశం
### ఢిల్లీ సదస్సులో ఏపి సిఎం చంద్రబాబు నాయుడు

న్యూఢిల్లీ,,**మార్చి 7.(జర్నలిస్ట్ వార్త):** నిపుణులు, వనరులు ఉన్న చోటుకే అవకాశాలు వెతుక్కుంటూ వచ్చే రోజులు వచ్చాయని, త్వరలోనే 'రివర్స్ మైగ్రేషన్' ప్రారంభమవుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జోస్యం చెప్పారు.గతంలో మన నిపుణులు సిలికాన్ వ్యాలీ వంటి ప్రాంతాలకు వెళ్లడం 'మేధో వలస'గా భావించేవారని, కానీ ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయని ఆయన విశ్లేషించారు. ప్రపంచ గమనంలో భారతీయుల పాత్ర, నాలెడ్జ్ ఎకానమీలో దేశం సాధించబోతున్న

మిగతా 2లో.




# గల్ఫ్‌కు సారీ

### ఇక మీపై దాడులు చేయబోం క్షమించండి
### ఎనిమిదో రోజుకు చేరుకున్న యుద్ధం
### ఇప్పటి వరకు చేసిన దాడికి 'సారీ' అన్న పెజెష్కియాన్
### గల్ఫ్ దేశాలపై ఇక దాడులు చేయబోమన్న అధ్యక్షుడు

**న్యూఢిల్లీమార్చి 7.(జర్నలిస్ట్ వార్త):** అమెరికా, ఇజ్రాయెల్ దేశాలతో యుద్ధం కొనసాగుతున్న సమయంలో, గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ క్షమాపణలు చెప్పారు. అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య భీకర యుద్ధం ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఇరాన్ గల్ఫ్ దేశాల్లోని అమెరికా ఆస్తులపై బాంబు దాడులు చేస్తోంది. తమ దేశంపై దాడులు చేస్తే ప్రతిదాడి చేస్తామని గల్ఫ్ దేశాలు కూడా ఇరాన్‌ను హెచ్చరించాయి. ఇలాంటి తరుణంలో ఈ కీలక పరిణామం చోటు చేసుకుంది.


మిగతా 2లో.




# ముగిసిన ఫిరాయింపు ఎమ్మెల్యేలపై విచారణ..

### కడియం, దానంల కేసుల్లో తీర్పు రిజర్వ్
### సుప్రీంకోర్టు ఆదేశాలతో విచారణ ముగించిన స్పీకర్
### 8 మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇచ్చిన స్పీకర్
### కడియం, దానంల భవితవ్యంపై ఉత్కంఠ

**మార్చి 7.(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో ఎమ్మెల్యేల ఫిరాయింపుల వ్యవహారం క్లైమాక్స్ కు చేరుకుంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పక్షాన చేరిన పది మంది ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈరోజు తుది విచారణ ముగించారు. సుప్రీంకోర్టు విధించిన గడువు ముగుస్తుండటంతో స్పీకర్ తీసుకున్న నిర్ణయం కీలకంగా మారింది. ఇందులో ఎనిమిది మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చీట్ ఇచ్చిన స్పీకర్, వారిపై ఉన్న పిటిషన్లను కొట్టివేశారు. అయితే, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కేసుల్లో మాత్రం తీర్పును రిజర్వ్ చేశారు. వీరిద్దరి భవితవ్యంపై స్పీకర్ ఏ క్షణమైనా తుది తీర్పు వెలువరించే అవకాశం ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది.





# శాంతియుత వాతావరణమమే శ్రీరామరక్ష

### లొంగిన మావోయిస్టులకు ఆర్థిక, ఆరోగ్య భద్రత
### 130 మంది మావోయిస్టులు లొంగుబాటు
### గణపతి కూడా లొంగి పోవాలన్న సిఎం రేవంత్

**హైదరాబాద్,మార్చి 7.(జర్నలిస్ట్ వార్త):** శాంతియుత వాతావరణంలోనే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. లొంగిపోయిన మావోయిస్టుల ఆర్థిక, ఆరోగ్య భద్రతకు భరోసా కల్పిస్తాం. ఇంకా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు లొంగిపోవాలి. లొంగిపోయిన మావోయిస్టులకు అవసరమైన వసతులు కల్పిస్తాం అని అన్నారు. 130 మంది మావోయిస్టులు శనివారం

మిగతా 2లో.

# వంటగ్యాస్ బాదుడు

మొదటిపేజీ తరువాయి

పెరిగిన ధరల ప్రకారం.. గృహ అవసరాలకు వినియోగించే 14.2 కేజీ డొమెస్టిక్ సిలిండర్ ధర ఢిల్లీలో రూ.853 నుంచి రూ.913కు ఎగబాకనుంది. ముంబయిలో రూ.852.50 నుంచి రూ.912.50కు, కోల్‌కతాలో రూ.879 నుంచి రూ.930కి, చెన్నైలో రూ.868.50 నుంచి రూ.928.50కు ధరలు పెరగనున్నాయి. ఇక హైదరాబాద్‌లోనూ ఈ సిలిండర్‌పై రూ.60 పెరిగింది. ధర రూ.905 నుంచి 965కు ఎగబాకింది.

ఇక 19కేజీల కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధర ఢిల్లీలో రూ.1768.50 నుంచి రూ.1883కు పెరగనున్నది. ఇది ముంబయిలో 1720.50 నుంచి రూ.1835కు, కోల్‌కతాలో రూ.1875.50 నుంచి రూ.1990కి, చెన్నైలో రూ.1929 నుంచి 2043.50కు చేరనున్నది. ఇక హైదరాబాద్‌లో వాణిజ్య సిలిండర్ ధర రూ.2105.50కు చేరింది.

కాగా దేశంలో ఇంధన కొరత లేదనీ, సరఫరాలో అంతరాయాల గురించి వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర పెట్రోలియం సహజవాయువు మంత్రి హర్దీప్ సింగ్ పూరి గతంలో వెల్లడించారు. చమురు, ఎల్పీజీ నిల్వలు సరిపడా ఉన్నాయని కూడా కేంద్రం అంటోంది. అయితే తాజా ధరల పెంపుతో కేంద్రం మాటలు నిజం కావని తేలిపోయిందని విశ్లేషకులు అంటున్నారు.

# శాంతియుత వాతావరణమమే శ్రీరామరక్ష

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. దేవ్‌జీకి చెందిన పీఎల్‌జీఏ కమిటీ మొత్తం సరెండర్ అయిపోయింది. మావోయిస్టులు తమ ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. మొత్తం 124 ఆయుధాలను సరెండర్ చేశారు. లొంగిపోయిన వారిలో దేవ్‌జీ, బడే చొక్కారావు గన్‌మెన్లు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ' మావోయిస్టుల లొంగుబాటుకు అధికారులు తీవ్ర కృషిచేశారు. పోలీసులు మావోయిస్టుల్లో నమ్మకం కల్పించారు. దేవ్‌జీ, ఆయన మిత్రబృందం కొన్ని ప్రతిపాదనలు చేశారు. తమ సమస్యలు పరిష్కరిస్తే లొంగిపోతామని చెప్పారు'. ÷ాష్ట్ర స్థాయిలో మేం చేయగలిగిందంతా చేస్తాం. మావోయిస్టు అగ్రనేత గణపతి కూడా లొంగిపోవాలి. అజ్ఞాతంలో ఉన్న తెలంగాణకు చెందిన ఏడుగురు కూడా.. త్వరగా లొంగిపోవాలి. లొంగిపోయిన వారికి పునరావాసం కల్పించాలని అమిత్ షా చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు కూడా అందజేస్తాం. ప్రత్యేకమైన ఆరోగ్య భద్రత కార్డులు ఇస్తాం' అని రేవంత్ రెడ్డి హామీ చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులకు అవసరమైన వసతులు కల్పిస్తాం. మావోయిస్టుల హోదాలను బట్టి ప్యాకేజీ కల్పిస్తాం. ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అని అన్నారు.

# రాష్ట్రపతినే అవమానిస్తారా ?

మొదటిపేజీ తరువాయి

ఇది సిగ్గుచేటని, మునుపెన్నడూ జరగలేదని టీఎంసీ పైన, మమతా బెనర్జీ ప్రభుత్వంపైన మండిపడ్డారు. 'ఇది సిగ్గుచేటు వ్యవహారం. గతంలో ఎన్నడూ ఇలా జరగలేదు. ప్రజాస్వామ్యం, గిరిజన వర్గాల సాధికారతకపై నమ్మకం ఉన్న ప్రతి ఒక్కరి నైతికస్థైర్యాన్ని దెబ్బతీసేలా ఈ చర్య ఉంది. గిరిజన కమ్యూనిటీకి చెందిన రాష్ట్రపతి వెలిబుచ్చిన ఆవేదన దేశ ప్రజల మనసుల్లో అపార దుఃఖాన్ని కలిగించింది' అని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మోదీ ట్వీట్ చేశారు. పశ్చిమబెంగాల్‌లోని టీఎంసీ ప్రభుత్వం అన్ని హద్దులు అతిక్రమించిందనీ, రాష్ట్రపతికి జరిగిన అవమానానికి ప్రభుత్వ యంత్రాంగానిదే బాధ్యత అని అన్నారు.ఉత్తర బెంగాల్‌లో అంతర్జాతీయ ఆదివాసీ సదస్సుకు హాజరయ్యేందుకు రాష్ట్రపతి సిలిగురికి వెళ్లారు. ప్రోటోకాల్ ప్రకారం రాష్ట్రపతికి ముఖ్యమంత్రి కానీ, మంత్రులు కానీ, సీనియర్ అధికారులు కానీ స్వాగతం పలకాల్సి ఉంది. అయితే అధికారికంగా స్వాగతించడానికి ప్రభుత్వం తరపున ఎవరూ రాలేదు. ముందుగా అనుకున్న సదస్సు వేదికకు భద్రతా కారణాలతో ప్రభుత్వం అనుమతి కూడా ఇవ్వలేదు. ఈ పరిణామాలపై రాష్ట్రపతి అసహనం వ్యక్తం చేశారు. దీనికి కారణం ఏమిటో వారికే తెలియాలని, అయితే తనపై మమత ప్రభుత్వంపై ఎలాంటి ద్వేషంలేదని, ఆమె తనకు సోదరితో సమానమని అన్నారు. తాను కూడా బెంగాల్ కూతుర్నేనని గుర్తుచేశారు.

# రైతుబంధు ఎప్పుడిస్తారు

ఎగొట్టారని ధ్వజమెత్తారు. శనివారం కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి నియోజకవర్గం గోపాలరావుపల్లిలో హరీశ్‌రావు పర్యటించారు. గోపాలరావుపల్లిలో పంట పొలాలను పరిశీలించారు. సాగునీరు లేక అన్నదాతలు పడుతున్న కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు ఏ మొహం పెట్టుకుని రైతుల దగ్గరకు పోతారు....? అని హరీశ్‌రావు నిలదీశారు. పోలీసులు లేకుండా జనం దగ్గరకు ఎమ్మెల్యేలు, మంత్రులు వెళ్లగలరా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందని కాంగ్రెస్ నేతలు చిల్లర మాటలు మాట్లాడుతారా..? అని ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్లే పంటలు పండుతున్నాయని స్పష్టం చేశారు. హైదరాబాద్‌కు తాగునీటిని అందించేది కాళేశ్వరం నీళ్లతోనేనని తేల్చిచెప్పారు. తమపై చిల్లర వ్యాఖ్యలను బంద్ చేయాలని.. లేకపోతే తాము ఊరుకోమని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందని అడ్డగోలు ఆరోపణలు చేస్తారా..? అని ఆగ్రహించారు. ఈ ప్రాజెక్టును ఎండబెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. మేడిగడ్డ పిల్లర్లను రేవంత్‌రెడ్డి సర్కార్ వెంటనే రిపేర్ చేయాలని డిమాండ్ చేశారు. రెండేళ్లలో కనీసం పది వేల ఎకరాలకు నీరిచ్చారా....? అని హరీశ్‌రావు ప్రశ్నల వర్షం కురిపించారు.

# గద్దర్ సినీ అవార్డుల ప్రకటన

**చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ అవార్డు**
**కమలహాసన్‌కు పైడి జయరాజ్ అవార్డు**
**సుద్దాల అశోక్ తేజకు సినారె అవార్డు**
**ఉత్తమ చిత్రంగా రాజు వెడ్స్ రాంబాయి**
**ఉత్తమ ద్వితీయ చిత్రంగా దండోరా**
**ఉత్తమ తృతీయ చిత్రంగా ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో**
**ఉత్తమ నటుడిగా నాగచైతన్య..**
**ఉత్తమ నటిగా రష్మిక మందన్నా**
**ఉత్తమ దర్శకుడిగా సాయిలు**
**ఉత్తమ సంగీత దర్శకుడు - మార్క్ రాబిన్**
**ఉగాది రోజు అవార్డుల బహుకరణ**



హైదరాబాద్,,**మార్చి 7.(జర్నలిస్ట్ వార్త):**
గద్దర్ సినీ అవార్డులను తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. 2025లో విడుదలైన చిత్రాలకు గద్దర్ అవార్డులను శనివారం ప్రకటించారు. అగ్ర నటుడు చిరంజీవిని ఎన్టీఆర్ జాతీయ పురస్కారంతో సత్కరించనున్నారు. ఇక, ప్రముఖ నటుడు కమల్ హాసన్‌ను పైడి జయరాజ్ అవార్డు, గేయ రచయిత సుద్దాల అశోక్ తేజను సినారె అవార్డు వరించింది. 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ద్వారా సర్టిఫికెట్ పొందిన చిత్రాలకు, షార్ట్‌ఫిల్మ్‌లకు ఈ అవార్డులు ప్రకటించారు. మార్చి 19 ఉగాది రోజున ఈ పురస్కారాల ప్రదానం జరగనుంది. ఈ ప్రకటన సినీ వర్గాల్లో, అభిమానుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. గతేడాది ప్రారంభమైన ఈ పురస్కారాల పరంపర, ఈసారి మరిన్ని ప్రతిష్ఠాత్మక విభాగాలతో ముందుకు వచ్చింది. ముఖ్యంగా మెగాస్టార్ చిరంజీవికి 'ఎన్టీఆర్ నేషనల్' అవార్డు ప్రకటించడం విశేషం. తెలంగాణ ప్రభుత్వం నంది అవార్డుల స్థానంలో సినీ కళాకారులకు గద్దర్ అవార్డులను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. దాదాపు దశాబ్ద కాలంపాటు నిలిచిపోయిన ప్రభుత్వ పురస్కారాల సంప్రదాయం రేవంత్‌రెడ్డి సర్కార్‌లో మళ్లీ ప్రారంభం కావడంతో కళాకారులకు ఎంతగానో ప్రోత్సాహంగా ఉందని సినీ ప్రముఖులు చెబుతున్నారు. ఈసారి ఉగాది రోజున సినీతారల సందడితో ఈ వేడుకను అత్యంత వైభవంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్వహించనుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్' రెండో విడత విజేతలను జ్యూరీ కమిటీ ప్రకటించింది. ఈ ఏడాది అవార్డుల్లో దిగ్గజ నటీనటులు, సాంకేతిక నిపుణులకు పెద్దపీట వేశారు. ఈ ఏడాది వివిధ విభాగాల్లో ఎంపికైన ప్రముఖుల జాబితాను ప్రకటించింది. స్పెషల్ అవార్డుల విభాగంలో ఎన్టీఆర్ జాతీయ అవార్డు – చిరంజీవిని వరించింది. రఘుపతి వెంకయ్య అవార్డు – రమేశ్ ప్రసాద్, పైడి జయరాజ్ అవార్డు – కమల్ హాసన్,నాగిరెడ్డి చక్రపాణి అవార్డు – అశ్వనీదత్,ఏఎన్‌ఆర్ అవార్డు – జయసుధ, టీఎల్.కాంతారావు అవార్డు – ఆర్.నారాయణ మూర్తి,సి.నారాయణ రెడ్డి అవార్డు – సుద్దాల అశోక్ తేజ,బీఎన్ రెడ్డి అవార్డు – సింగీతం శ్రీనివాసరావులను వరించాయి. ఇక ఉత్తమ చిత్రంగా రాజు వెడ్స్ రాంబాయి, ఉత్తమ ద్వితీయ చిత్రంగా దండోరా, ఉత్తమ తృతీయ చిత్రంగా ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షోలను ఎంపిక చేశారు. ఉత్తమ నటుడు – నాగచైతన్య (తండేల్),ఉత్తమ నటి – రష్మిక (ది గర్ల్ ఫ్రెండ్),ఉత్తమ దర్శకుడు – సాయిలు (రాజు వెడ్స్ రాంబాయి),బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ అన్ నేషనల్ ఇంటిగ్రేషన్ – తండేల్,ఉత్తమ సందేశాత్మక చిత్రం – కోర్ట్,ఉత్తమ ప్రజాదరణ చిత్రం – సంక్రాంతికి వస్తున్నాం,ఉత్తమ నూతన దర్శకుడు – సాయి మార్తాండ్ (లిటిల్ హార్ట్స్),ఉత్తమ బాలల చిత్రం–అనగనగా ఉత్తమ సహాయ నటుడు – శివాజీ (దండోరా),ఉత్తమ సహాయ నటి – భూమిక (యుఫోరియా),ఉత్తమ సంగీత దర్శకుడు – మార్క్ రాబిన్ (దండోరా),ఉత్తమ గాయకుడు – అనురాగ్ కులకర్ణి (రాజు వెడ్స్ రాంబాయి),ఉత్తమ గాయని – సాహితీ చాగంటి (కన్నప్ప), ఉత్తమ బాలనటుడు – మాస్టర్ రోహన్ (ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో),ఉత్తమ కథా రచయిత – గుణశేఖర్ (యుఫోరియా),ఉత్తమ స్క్రీన్ ప్లే – అనిల్ రావిపూడి (సంక్రాంతికి వస్తున్నాం),ఉత్తమ గేయ రచయిత – నందకిశోర్ (కుబేర),ఉత్తమ సినిమాటోగ్రాఫర్ – కార్తీక్ ఘట్టమనేని (మిరాయ్),ఉత్తమ ఎడిటర్ – శ్రీకర్ ప్రసాద్ (మిరాయ్),ఉత్తమ ఆడియోగ్రాఫర్ – ఎం.ఆర్ రాధాకృష్ణన్ (కిష్కింధపురి),ఉత్తమ కొరియోగ్రాఫర్ – సందీప్ (ఛాంపియన్),ఉత్తమ ఆర్ట్ డైరెక్టర్ – తోటతరణి (ఛాంపియన్),ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్ – గోవిందరాజు (అఖండ –2),ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్ – చంద్రకాంత్ (ఛాంపియన్),ఉత్తమ యాక్షన్ కొరియోగ్రాఫర్ – పీటర్ హెయిన్స్ (ఛాంపియన్),స్పెషల్ జ్యూరీ అవార్డుల కింద శ్రీరాజ్ రాచకొండ (23 ఫిల్మ్),చైతు జొన్నలగడ్డ (రాజు వెడ్స్ రాంబాయి),రోషన్ మేక (ఛాంపియన్),అనంతిక (8 వసంతాలు)కు దక్కాయి. గద్దర్ అవార్డులపై సినీరంగం హర్షం వ్యక్తం చేస్తోంది. ఈ అవార్డులను మార్చి 19న ఉగాది పర్వదినం సందర్భంగా అత్యంత వైభవంగా నిర్వహించే వేడుకలో ప్రదానం చేయనున్నారు. స్పెషల్ జ్యూరీ చైర్మన్‌గా ప్రముఖ నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ నేతృత్వంలోని కమిటీ ఈ అవార్డులను ఎంపిక చేసింది.

# త్వరలో రివర్స్ మైగ్రేషన్‌కూడా సాధ్యమే

మొదటిపేజీ తరువాయి

ప్రగతిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అనేక దేశాల అభివృద్ధిలో భారతీయుల పాత్ర ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులు కనిపిస్తారన్నారు. సంస్కరణల వల్లే మన దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ– అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దిల్లీలో నిర్వహించిన 'రైసినా డైలాగ్' సదస్సులో చంద్రబాబు మాట్లాడారు. కేంద్రంతో కలిసి ముందుకెళు తున్నట్లు చెప్పారు. ఐటీలో భారతీయుల పరిజ్ఞానం అందరికీ తెలిసిందే. డిప్లమసీ, ఫ్లెక్సిబిలిటీ విషయాల్లో భారతీయులకు మంచి పేరుంది. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి దిశగా భారత్ దూసుకెళ్తోంది. మన దేశం భవిష్యత్‌లో అనేక దేశాలకు విద్యుత్ ఇస్తుంది. విదేశాలకు వెళ్లే విద్యార్థుల్లో ఎక్కువ శాతం ఏపీ వాళ్లే ఉన్నారు. ప్రస్తుతం అనేక దేశాల్లో వృద్ధులు పెరుగుతున్నారు. దక్షిణాదిలో సంతానోత్పత్తి రేటు 1.5శాతమే ఉంది. 30 ఏళ్ల క్రితం కుటుంబ నియంత్రణ పాటించాలని చెప్పాం. ఇప్పుడు ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉండాలని చెబుతున్నా. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి అనేక ప్రయోజనాలు కల్పిస్తాం. భవిష్యత్‌లో గ్లోబల్ కమ్యూనిటీకి సేవ చేసే సామర్థ్యం భారత్‌కే ఉంది. వృద్ధుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో పాపులేషన్ మేనేజ్‌మెంట్ చాలా కీలకం. విభిన్నంగా ఆలోచించే వారికోసం అమరావతిలో క్రియేటివ్ సిటీ నిర్మిస్తున్నాం. డ్రోన్ సిటీ, ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్ సిటీలు కూడా నిర్మిస్తున్నాం. భవిష్యత్‌లో ఆరోగ్య రంగంలో పెను మార్పులు వస్తాయి. త్వరలో డ్రోన్ అంబులెన్స్‌లు కూడా వస్తున్నాయని చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా ఐటీ రంగం నుండి గ్రీన్ ఎనర్జీ వరకు, జనాభా విధానం నుండి ఏఐ వరకు భవిష్యత్ భారత్ ఎలా ఉండబోతోందో తన విజన్‌ను పంచుకున్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ డిప్లొమాట్లు భారతీయులేనని చంద్రబాబు కొనియాడారు. ఎక్కడికి వెళ్లినా స్థానిక సంస్కృతులతో కలిసిపోవడంలో భారతీయులకు మించిన వారు లేరన్నారు. నవ్యాంధ్రను డేటా సెంటర్ల హబ్‌గా మార్చేందుకు గ్రీన్ ఎనర్జీని పెద్ద ఎత్తున ఉత్పత్తి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. భారత్ ప్రస్తుతం సింగిల్ గ్రిడ్ ద్వారా ఎనర్జీ ట్రాన్స్‌ఫర్మేషన్ సాధిస్తోందని, భవిష్యత్తులో దేశం విద్యుత్తును ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీలో గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించామని, ఏఐ , క్వాంటం ఏఐ అల్గారిథమ్స్ రంగాల్లో యువతకు అపారమైన అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. దీనికి నిదర్శనంగా ఇటీవల శిక్షణ కోసం పిలుపునిస్తే 50 వేల మంది యువత రిజిస్టర్ చేసుకున్నారని ఆయన గుర్తు చేశారు. దేశం ఎదుర్కోబోతున్న 'ఏజింగ్' అంటే వృద్ధాప్య జనాభా సమస్యపై చంద్రబాబు గట్టిగా హెచ్చరించారు. గతంలో జనాభా నియంత్రణ గురించి మాట్లాడిన తాను, ఇప్పుడు భవిష్యత్ ప్రమాదాన్ని గుర్తించి 'జనాభా నిర్వహణ' గురించి మాట్లాడుతున్నానని స్పష్టం చేశారు. ఏపీలో ఫెర్టిలిటీ రేటును 1.5 నుండి 2.1కు పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలను వివరించారు. మూడో బిడ్డ పుడితే రూ. 25 వేల ఆర్థిక సాయంతో పాటు, ప్రతి నెలా రూ. 1,000 అందించాలని నిర్ణయించాం అన్నారు. తల్లిదండ్రులకు ప్రోత్సాహకంగా చైల్డ్ కేర్ లీవ్ వంటి సౌకర్యాలపై ఆలోచన చేస్తున్నాం. గతంలో భారతదేశంలో ఉన్న ఉమ్మడి కుటుంబ వ్యవస్థ దేశానికి పెద్ద ఆస్తి అని, ప్రస్తుతం మైక్రో ఫ్యామిలీల వల్ల వస్తున్న మార్పులపై ప్రజల దృక్పథం మారాలని ఆయన పిలుపునిచ్చారు.

# మహిళల రక్షణ సమాజం బాధ్యత

మొదటిపేజీ తరువాయి

గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తోంది. సోషల్ మీడియాలో మహిళలను వేధించే ఘటనలు తాజాగా పెరుగుతున్నాయి. వాటిని కట్టడి చేయాల్సి ఉందని అన్నారు. ఈ సందర్భహంగా మహిళలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా 'స్టాండ్ విత్ హర్' బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మహిళా దినోత్సవం జరుపుకుంటేనే బాధ్యత తీరిపోయినట్టు కాదన్నారు. మహిళా నాయకత్వం నుంచి వచ్చిన పార్టీ ద్వారా రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. మహిళలను శక్తితో పోలుస్తామని.. కుటుంబ గౌరవాన్ని కూడా మహిళలతో పోలుస్తామని సీఎం తెలిపారు. మహిళలకు వేధింపులు.. పట్టణాలు, కాలేజీలు, పబ్లిక్ ప్రాంతాలకు మాత్రమే పరిమితం కాలేదని.. సోషల్ మీడియాలో మహిళలు ఎక్కువగా వేధింపులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. 'మనల్ని మనం సవరించుకొని మహిళల పట్ల మన బాధ్యతల్ని నెరవేర్చాలని సీఎం సూచించారు. మహిళల రక్షణ కోసం చట్టాలు చేస్తే బాధ్యత తీరిపోయిందని అనుకోవడం తప్పని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల కేటాయింపులు, రేషన్ కార్డులు అన్నీ మహిళల పేర్లమీద ఇస్తోందన్నారు. తెలంగాణలో స్వయం సహాయక సంఘాల మహిళలకు సోలార్ పవర్ ఉత్పత్తి చేసి విద్యుత్ శాఖకు అమ్మే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు. ఈ నిర్ణయంతో మహిళలు అదానీ, అంబానీల స్థాయిలో విద్యుత్ రంగంలో పోటీ పడే అవకాశం ఇచ్చామన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం పలు అవకాశాలు కల్పిస్తోందని సీఎం రేవంత్ తెలిపారు.



ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం ద్వారా వారి స్వేచ్ఛ పెరిగిందని సీఎం తెలిపారు. జిల్లాల్లో ప్రభుత్వ స్థలాలు కేటాయించి మహిళల చేతుల్లో పెట్రోల్ బంకులు నిర్వహించే అవకాశాలు ఇచ్చామన్నారు. దేశంలోనే తొలిసారి మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టింది తెలంగాణ ప్రభుత్వమని చెప్పారు. రాష్ట్రంలో చీఫ్ సెక్రటరీ సహా కీలక అధికార పదవుల్లో మహిళలకు అవకాశాలు కల్పిస్తున్న ప్రభుత్వం తమదే అని అన్నారు. మహిళల శక్తి, నైపుణ్యంపై ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం ఉందని స్పష్టం చేశారు. తెలంగాణను దేశంలోనే మహిళలకు అత్యంత భద్రత కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.మహిళల రక్షణను సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సీఎం రేవంత్ అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే కుటుంబం, రాష్ట్రం, దేశం బలపడుతుందన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళలు సైంటిస్టులు, డాక్టర్లు, ఇంజనీర్లుగా రాణిస్తున్నారని తెలిపారు. మహిళలు ధైర్యంగా ఉద్యోగ, ... వినియోగించుకోవాలని



సూచించారు. ఎక్కడైనా మహిళలపై వేధింపులు జరిగితే నిలబడి ప్రశ్నించే ధైర్యం సమాజంలో రావాలన్నారు. కాలేజీలు, బస్టాండ్లు సహా ఎక్కడైనా జరిగే వేధింపులను చూసీ చూడనట్టు ఉండడం కూడా నేరాన్ని ప్రోత్సహించడమే అని అన్నారు. సోషల్ మీడియా ద్వారా మహిళలపై సైబర్ వేధింపులు పెరుగుతున్నాయని తెలిపారు. మహిళలపై మార్ఫింగ్, ఫేక్ వీడియోలు వంటి సైబర్ నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ శివధర్‌రెడ్డి, నగర పోలీసు కమిషనర్ సజ్జనార్, సినీ నటుడు సాయి ధరమ్ తేజ్ తదితరులు పాల్గొన్నారు.

# గల్ఫ్‌కు సారీ

మొదటిపేజీ తరువాయి

ఇరాన్ ప్రజలను ఉద్దేశించి అధ్యక్షుడు ఒక టీవీ ఛానల్‌లో మాట్లాడారు. గల్ఫ్ దేశాలపై ఇక ఎలాంటి దాడులు జరగబోవని పెజెష్కియాన్ కీలక ప్రకటన చేశారు. అయితే పొరుగు దేశాలు తమపై ప్రత్యక్ష దాడికి దిగితే మాత్రం స్పందించే హక్కు ఉందని స్పష్టం చేశారు."ఇరాన్ దాడికి గురైన పొరుగు దేశాలకు నా తరపున, ఇరాన్ ప్రజల తరపున క్షమాపణలు చెబుతున్నాను. గల్ఫ్ దేశాలపై ఇక దాడులు జరగవు. ఇరాన్‌పై ఆ దేశాలు దాడి చేయకపోతే తాము కూడా ఎలాంటి క్షిపణులు ప్రయోగించకూడదని తాత్కాలిక నాయకత్వ మండలి నిర్ణయించింది" అని ఇరాన్ స్టేట్ టీవీలో ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో పెజెష్కియాన్ ఈ వ్యాఖ్యలు చేశారు.పొరుగు దేశాలపై దాడులు చేయడం తమ ఉద్దేశం కానేకాదని అన్నారు. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత తీవ్రం కాకూడదనే ఉద్దేశంతో గల్ఫ్ దేశాలపై దాడులు చేయకూడదని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.ఇరాన్ లొంగిపోవాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై కూడా పెజెష్కియాన్ స్పందించారు. టెహ్రాన్ లొంగిపోయే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఇరాన్ లేదా ఇరాన్ ప్రజలు లొంగిపోవాలనే వారి కలలను వారు సమాధి చేసుకోవాలని వ్యాఖ్యానించారు.

# వీడిన కల్తీ పాల మిస్టరీ

మొదటిపేజీ తరువాయి

మరణించినట్లు అధికారులు వెల్లడించారు. కోరుకొండ మండలం నరసాపురానికి చెందిన అడ్డాల గణెళీశ్వరరావు 'వరలక్ష్మి పాల కేంద్రం' పేరుతో వ్యాపారం నిర్వహిస్తున్నాడు. పాలను నిల్వ చేసే ఫ్రీజర్ లీక్ అవ్వడంతో, ఆ ప్రదేశంలో ఎం–సీల్ తో అతికించాడు. అయితే, గత నెల 15వ తేదీన పాల కేంద్రంలోని పాలు చేదుగా ఉన్నాయని కొంతమంది ఖాతాదారులు ఫిర్యాదు చేసినప్పటికీ, వ్యాపారి నిర్లక్ష్యంగా వ్యవహరించారు. మరుసటి రోజు కూడా అవే పాలను రాజమండ్రిలో వివిధ ప్రాంతాలకు సరఫరా చేశాడు. ఫ్రీజర్ నుంచి లీక్ అయిన రసాయనాలు పాలలో కలవడం వల్లే అవి విషతుల్యంగా మారినట్టు దర్యాప్తులో తేలింది. పోలీసులు అక్కడ ఉన్న ఫ్రిజర్‌తో పాటు ఇతర పదార్ధాలను స్వాధీనం చేసుకొని ల్యాబ్‌కు పంపగా ఈ షాకింగ్ నిజాలు బయటపడ్డాయి. గత నెల 16న ఈ కల్తీ పాలు సేవించి అస్వస్థతకు గురైన 20 మందిలో ఇప్పటి వరకు 10 మంది మరణించారు. మిగిలిన 10 మంది ఇంకా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ దారుణానికి బాధ్యుడైన అడ్డాల గణెళీశ్వరరావును పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆయనపై 9 కేసులు నమోదయ్యాయి. డీఎస్పీ దేవకుమార్ ఆధ్వర్యంలో ఈ కేసు దర్యాప్తు వేగంగా కొనసాగుతోంది.

## ధర్మసాగర్ జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ పాఠశాలలో

# ఘనంగా వార్షికోత్సవం






**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరో మార్చి 7 (జర్నలిస్ట్ వార్త):** ధర్మసాగర్ గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.బి. ధర్మ ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఎలియా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన "ది యంగ్ మైండ్స్" పాఠశాల మ్యాగజైన్‌ను ఆమె ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు వివిధ సామాజిక అంశాలపై రూపొందించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రతిభకు సభికులు కరతాళ ధ్వనులతో అభినందనలు తెలిపారు. ఈ నృత్యాలకు ఉపాధ్యాయులు కవితాదేవి, రాజమ్మ శిక్షణ అందించారు. పాఠశాలలో నిర్వహించిన క్రీడా



పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముఖ్య అతిథి మాచర్ల జ్యోతి ఎలియా, వార్డ్ సభ్యులు చిలుక ప్రతిభ, మల్కిరెడ్డి మమత, బెల్లం ప్రేమ్ కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ బహుమతి ప్రదాన కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు కిరణ్మయి, రామకృష్ణ, ప్రసన్న సమర్థంగా నిర్వహించారు. కార్యక్రమ ఏర్పాట్లు సీనియర్ ఉపాధ్యాయులు సురేష్, సుధీర్ రెడ్డి పర్యవేక్షణలో జరిగాయి. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి తమ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులను పురుష ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళలతోనే సమాజాభివృద్ధి

### ఉస్మానియా వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాగిణి






**సత్తుపల్లి/మార్చి 7 (జర్నలిస్ట్ వార్త):** సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని హైదరాబాద్ ఉస్మానియా వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాగిణి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8) పురస్కరించుకొని సత్తుపల్లిలోని విశ్వశాంతి విద్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాలయంలో మహిళల కోసం రెండు రోజులపాటు నిర్వహించిన ఆటల పోటీలలో విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి ఉపాధ్యాయులకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ రాగిణి మాట్లాడుతూ కుటుంబానికి వెన్నెముకగా నిలిచే మహిళలు తల్లిగా, కుమార్తెగా, సోదరిగా కుటుంబాన్ని ప్రేమతో కాపాడుతూ పిల్లలకు విలువలను నేర్పుతున్నారని అన్నారు. సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని, వారు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ పిల్లల వ్యక్తిత్వం, ప్రవర్తన, భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లుల పాత్ర అత్యంత ముఖ్యమని అన్నారు. మహిళలు సమాజంలో ప్రేమ, కరుణ, సహకారం వంటి విలువలను పెంపొందిస్తూ నాయకులుగా, శాస్త్రవేత్తలుగా, ఉపాధ్యాయులుగా, సామాజిక సేవకులుగా సమాజానికి ప్రేరణగా నిలుస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశ్వశాంతి విద్యాలయం యాజమాన్యం నరుకుళ్ల సత్యనారాయణ, అవినాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి

# ముల్కనూర్ డెయిరీ బిస్కెట్లు

### ముల్కనూర్ మహిళా డెయిరీ నుంచి ఉస్మానియా బిస్కెట్, రస్క్ విడుదల





**భీమదేవరపల్లి/మార్చి7 (జర్నలిస్ట్ వార్త):**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ముల్కనూర్ మహిళా సహకార డెయిరీ తెలంగాణకు ప్రత్యేకమైన ఉస్మానియా బిస్కెట్ మరియు రస్క్ బిస్కెట్‌లను విడుదల చేసింది. శనివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ డెయిరీలో బుర్ర ధనశ్రీ అధ్యక్షతన పాలకవర్గం, సిబ్బంది మరియు సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించి ఈ ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకువచ్చారు. మహిళా సాధికారత స్ఫూర్తితో ముల్కనూర్ మహిళల సహకార డెయిరీ ప్రీమియం నాణ్యతతో ఉస్మానియా బిస్కెట్, రస్క్ బిస్కెట్‌లను తయారు చేసి రాష్ట్రవ్యాప్తంగా వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు శ్రీకారం చుట్టుతూ ఈ ఉత్పత్తులను విడుదల చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సాంప్రదాయ వంటకాల పద్ధతులు, ఉత్తమమైన స్థానిక పదార్థాలతో తయారుచేసిన ఈ బిస్కెట్లు తెలంగాణకు ప్రత్యేకమైన రుచిని అందిస్తాయని తెలిపారు. నోట్లో కరిగే వెన్న రుచిగల ఉస్మానియా బిస్కెట్లు, కరకరలాడే బంగారు రంగు రస్క్ బిస్కెట్లు టీ టైం అల్పాహారానికి మరియు పండుగ సందర్భాల్లో ఆస్వాదించడానికి అనువుగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముల్కనూర్ మహిళల సహకార డెయిరీ జనరల్ మేనేజర్ మార్పటి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, రేపు జరగబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణలో డెయిరీ మరియు ఆహార రంగాన్ని ముందుకు నడిపిస్తున్న మహిళలకు గౌరవంగా ఈ ఉత్పత్తులను ముందుగానే విడుదల చేసినట్లు తెలిపారు. ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉండే ధరలో ఈ బిస్కెట్లు అందిస్తున్నామని అన్నారు. ఇంకా ఆయన మాట్లాడుతూ, ఈ మైలురాయి తమ సంస్థలో ఉన్న నూతన ఆవిష్కరణల పట్ల కట్టుబాటు మరియు మహిళల నాయకత్వాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపారు. తెలంగాణ సంప్రదాయ వంటకాల రుచిని నిలబెట్టే నాణ్యమైన ఉత్పత్తులను అందించడం తమ లక్ష్యమని చెప్పారు. ప్రస్తుతం ఈ ఉత్పత్తులు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్థానిక కిరాణా దుకాణాలలో అందుబాటులో ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## ముదిరాజ్ సర్పంచులను సన్మానించిన నాయకులు



**రాయపర్తి/మార్చి 7 (జర్నలిస్ట్ వార్త):** ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచులుగా ఎన్నికైన ముదిరాజ్ కులస్తులను శనివారం ఘనంగా సన్మానించారు. ముదిరాజ్ మహాసభల రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మండల అధ్యక్షుడు ముద్రబోయిన వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గట్టికల్ గ్రామ సర్పంచ్ చెవ్వ హేమలత కాశీనాథం, కొండాపురం సర్పంచ్ కనుకుంట్ల మంజుల అశోక్, మొరిపిరాల గ్రామ ఉపసర్పంచ్ కుక్కల మహేందర్‌లను సిద్దిపేట మాజీ కౌన్సిలర్ పెసర రాజు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా పెసర రాజు మాట్లాడుతూ ముదిరాజ్ సమాజంలో రాజకీయ చైతన్యం మరింత పెరగాలని అన్నారు. ముదిరాజ్ యువత రాజకీయాల్లో ముందుకు వచ్చి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పులి సదానందం, చిరంజీవి, గుంటుక యాకయ్య, జంగిలి నరేష్, ముద్రబోయిన సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కోతులను తరిమేందుకు ఎలుగుబంటి వేషం



**రాయపర్తి/మార్చి 7 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని కాట్రపల్లి గ్రామంలో కోతుల బెడదతో ఇబ్బంది పడుతున్న గ్రామస్తులను, పంట పొలాలను రక్షించేందుకు వినూత్న ప్రయత్నం చేశారు. గ్రామ సర్పంచ్ రాపాక పద్మ బ్రహ్మచారి శనివారం గ్రామ పంచాయతీ సిబ్బందికి ఎలుగుబంటి వేషధారణ చేయించి గ్రామంలోని వాడవాడల్లో తిరిగిస్తూ కోతులను భయపెట్టించారు. గ్రామంలో గత కొంతకాలంగా కోతులు ఎక్కువగా సంచరిస్తూ ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను నాశనం చేయడం, పంట పొలాల్లో పంటలను దెబ్బతీయడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో కోతులను తరిమేందుకు ఈ విధంగా ఎలుగుబంటి వేషధారణను ఉపయోగించినట్లు సర్పంచ్ తెలిపారు. ఎలుగుబంటి వేషంలో గ్రామంలో తిరుగుతున్న సిబ్బందిని చూసి కోతులు బెదిరిపోయి అక్కడి నుంచి పారిపోయినట్లు గ్రామస్తులు చెప్పారు. ఈ చర్యతో కోతుల బెడద కొంతవరకు తగ్గుతుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**ఖమ్మం/మార్చి 7 (జర్నలిస్ట్ వార్త):**



నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ తమ ప్రతిభను నిరూపిస్తున్నారని పాలేరు డివిజన్ ఉద్యాన శాఖ అధికారి పి. అపర్ణ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా శక్తి ప్రతిభకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు. వ్యవసాయం నుంచి పైలట్ వరకు మహిళలు అన్ని రంగాల్లో తమ సత్తా చాటుతూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆమె అన్నారు. దేశ రక్షణలో కూడా మహిళల పాత్ర విశేషమని, ఆపరేషన్ సిందూర్ వంటి కార్యక్రమాల్లో మహిళల వీరోచిత సేవలను కొనియాడారు. చిన్న చిన్న సమస్యలకు కుంగిపోకుండా సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ మహిళలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అపర్ణ పిలుపునిచ్చారు. ప్రస్తుతం ప్రతి రంగంలోనూ మహిళలు తమ ప్రతిభను చాటుతూ ముందంజలో ఉన్నారని ఆమె తెలిపారు.

## పాఠశాలల ప్రగతికి ప్రజా పాలన బాట

### పర్వతగిరిలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రారంభం



**పర్వతగిరి/మార్చి 7(జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక పర్వతగిరి మండల కేంద్రంలో ఘనంగా ప్రారంభమైంది. స్థానిక పీఎం శ్రీ టి.జి.ఎస్.డబ్ల్యూ.ఆర్.ఎస్ , జూనియర్ బాలికల కళాశాల ఆవరణలో శనివారం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక బ్యానర్‌ను పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ 99 రోజుల ప్రణాళికలో భాగంగా పాఠశాలల్లో చేపట్టబోయే మార్పులను ఉపాధ్యాయ బృందం తల్లిదండ్రులకు వివరించింది. ముఖ్యంగా:మౌలిక వసతులు: పాఠశాల భవనాల మరమ్మతులు, తాగునీరు, ఇతర సౌకర్యాల మెరుగుదల. పరిసరాల పరిశుభ్రత: విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రాంగణమంతా స్వచ్ఛంగా తీర్చిదిద్దడం. విద్యా ప్రమాణాలు: విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక బోధన ప్రణాళికల అమలు చెయ్యడం ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై పేరెంట్స్ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధిలో తాము భాగస్వాములై, పూర్తి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ పి. అపర్ణ, వైస్ ప్రిన్సిపల్స్ , జోస్నా స్వాతి పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ ఐలపాక స్వప్న, మాజీ వైస్ చైర్మన్ వేల్పుల కుమారస్వామి . కమిటీ సభ్యులు బిర్రు కరుణాకర్, పసునూరి భాస్కర్, సింగారం గోపాల్, రాజు, అనూష, సుమ, బిర్రు రవీందర్ మరియు ఉపాధ్యాయ బృందం, సిబ్బంది హాజరయ్యారు.

# నూతన వధువును ఆశీర్వదించిన మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య



**తల్లాడ/మార్చి 7 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడలో శనివారం జరిగిన వివాహ కార్యక్రమానికి హాజరైన సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య నూతన వధువు మౌనికను ఆశీర్వదించారు. రాయల గోవిందరావు, మాధవి దంపతుల కుమార్తె మౌనికకు ఆశీస్సులు అందజేసి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడిన ఆయన వధూవరులు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్ రెడ్డి, తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు (చిన్నబ్బాయి), ఉప సర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి, మండల కార్యదర్శి దుగ్గదేవర వెంకటలాలు, తల్లాడ టౌన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గరిడేపల్లి వెంకటేశ్వర్లు (జివిఆర్), టౌన్ ఉపాధ్యక్షుడు సంగసాని శ్రీను, మాజీ జోనల్ చైర్మన్ దగ్గుల శ్రీనివాసరెడ్డి, గుండ్ల నాగయ్య తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# విద్యాశాఖలో ఖమ్మం జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలి

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి





**ఖమ్మం/మార్చి 7 (జర్నలిస్ట్ వార్త):** విద్యాశాఖ పనితీరులో ఖమ్మం జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హైస్కూల్ హెడ్‌మాస్టర్లు, మండల విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత ప్రాథమిక విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ప్రస్తుతం విద్యాశాఖ పనితీరులో ఖమ్మం జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో ఉందని పేర్కొన్నారు. 99 రోజుల కార్యాచరణను కట్టుదిట్టంగా అమలు చేస్తూ రాబోయే పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. మార్చి 6 నుంచి 15 వరకు పారిశుధ్య నిర్వహణను ప్రధాన అంశంగా చేపట్టామని తెలిపారు. ప్రతి పాఠశాలలో పనికిరాని పాత సామాగ్రి, కంప్యూటర్లు, రిజిస్టర్లు తొలగించాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రభుత్వ పాఠశాలలకు ప్రత్యేకంగా 70 లక్షల రూపాయల నిధులు కేటాయించామని, ఆ నిధులను సమర్థంగా వినియోగించి అవసరమైన పనులు పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలల్లో ఫైల్ నిర్వహణ శుభ్రంగా ఉండాలని, మరుగుదొడ్లలో ఎలాంటి సమస్యలు ఉన్నా స్థానిక సంస్థల సహకారంతో వెంటనే పరిష్కరించాలని చెప్పారు. ప్రతి పాఠశాలలో ఉన్న ఆస్తుల వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.

మార్చి 14 నుంచి ఏప్రిల్ 13 వరకు జరిగే పదో తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. పరీక్షల మధ్య ఉన్న విరామ సమయంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గదర్శనం చేస్తూ వారి ఒత్తిడిని తగ్గించాలన్నారు. ముఖ్యంగా బలహీనంగా ఉన్న విషయాల్లో విద్యార్థులు పునరావృతంగా అభ్యాసం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయుల హాజరు పాఠశాల నిర్వహణలో కీలకమని, 90 శాతం హాజరు ఉన్న పాఠశాలలు మెరుగైన పురోగతి సాధిస్తున్నాయని తెలిపారు. ఉపాధ్యాయులు ముందస్తు సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. 99 రోజుల కార్యాచరణ ముగిసే నాటికి జిల్లాలోని అన్ని విద్యార్థులకు ఆధార్, అపార్ సంఖ్యలు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను హెడ్‌మాస్టర్లు, ఉపాధ్యాయులు తరచుగా పరిశీలించాలని చెప్పారు. ప్రాథమిక పాఠశాలల్లో 'ఎవ్రీ చైల్డ్ రీడ్స్' కార్యక్రమం ద్వారా విద్యార్థుల విద్యా ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడ్డాయని తెలిపారు. రాబోయే విద్యా సంవత్సరంలో ఉన్నత తరగతుల విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైనీ, విద్యాశాఖ ప్రణాళిక సమన్వయకర్త సీహెచ్ రామకృష్ణ, సీఎంఓ ప్రవీణ్, మండల విద్యాశాఖ అధికారులు, హెడ్‌మాస్టర్లు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# టాలెంట్ స్కూల్లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం





**సత్తుపల్లి/ మార్చి 7 (జర్నలిస్ట్ వార్త):**
స్థానిక సత్తుపల్లి టాలెంట్ స్కూల్లో అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలను ఎలా నివారించాలి, గాయపడిన వారిని ఎలా రక్షించాలి అనే అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ వై. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల సమయంలో ప్రజలను సురక్షితంగా బయటకు తీసుకురావడం, గాయపడిన వారికి ప్రాథమిక చికిత్స అందించడం, రెస్క్యూ విధానాల ద్వారా ప్రాణాలను కాపాడే పద్ధతులపై ప్రదర్శనలు నిర్వహించారు. ఇంట్లో గ్యాస్ సిలిండర్ వల్ల సంభవించే ప్రమాదాలు, వాటిని నివారించే మార్గాలు, అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ పద్ధతి ద్వారా ప్రాణాలను ఎలా కాపాడవచ్చో కూడా వివరించారుఈ సందర్భంగా విద్యార్థులకు ప్రాయోగికంగా కొన్ని రక్షణ పద్ధతులను చూపించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈ. రమేష్, జి. రవికాంత్, వై. అనిల్ కుమార్, కె. బాబురావు, టాలెంట్ స్కూల్ కరెస్పాండెంట్ పులి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పులి అరుణ, స్కూల్ ఇంచార్జ్ శంకర్, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# చర్చి పునాదిరాయి ఏర్పాటు చేసిన దైవ సేవకులు





**గంపలగూడెం/మార్చి 7 (జర్నలిస్ట్ వార్త):**
మండల పరిధిలోని నెమలి గ్రామంలో శనివారం చర్చి నిర్మాణానికి పునాదిరాయి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాస్టర్ దుబ్బాకుల సునీల్ ఆధ్వర్యంలో దైవ సేవకుల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అనంతరం చర్చి పునాదిరాయిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దైవ సేవకులు దేవుని ఆశీస్సులతో చర్చి నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తి కావాలని ప్రార్థించారు. అనంతరం సంఘ పెద్దలు, సంఘస్తులు కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ జి.జి. జోసెఫ్, యాకోబు, స్టీఫెన్ పాల్, పాస్టర్ కాంతయ్యతో పాటు దైవ సేవకులు, సంఘ పెద్దలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన వారందరికీ ప్రేమ విందు ఏర్పాటు చేశారు.

# మల్లన్న సొమ్ము... మాయాజాలం.

## దేవుడి కానుకలతో మేడారం దావతులా? -వర్ధన్నపేట ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య

**సీల్ చోరీ గ్రామ పంచాయతీ రౌండ్ సీల్ దుర్వినియోగం.**

**తప్పుడు లెక్కలు జాతర ఖర్చుల్లో కారు కిరాయి, డీజే, పోలీస్ స్టేషన్ ఖర్చులు.**

**బహిరంగ విందులు ఆలయ సొమ్ముతో మేడారంలో విందులు చేసుకున్న కమిటీ సభ్యులు.**

**డిమాండ్ అక్రమ కమిటీని రద్దు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.**



**వర్ధన్నపేట/మార్చి 7(జర్నలిస్ట్ వార్త):**
దేవుడి సొమ్ము దేవుడికే ఖర్చు చేయాలి. భక్తుల కానుకలతో విందులు ఆరగించడం అక్షరాలా దైవద్రోహమే అని వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య మండిపడ్డారు. మండలంలోని కట్రీయాల శ్రీ మల్లిఖార్జున స్వామి దేవాలయ కమిటీ అక్రమాలపై ఆయన శనివారం మీడియా వేదికగా విరుచుకుపడ్డారు. ఆలయ ఆదాయ వ్యయాల్లో భారీ అవినీతి జరిగిందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ముద్రతో దౌర్జన్యంచేయడం పై
ఆలయ కమిటీ ఏర్పాటులోనే అక్రమాలు చోటుచేసుకున్నాయని వెంకటయ్య ఆరోపించారు. గ్రామ కార్యదర్శి లేని సమయంలో పంచాయతీ కార్యాలయంలోకి చొరబడి, ప్రభుత్వ అధికారి వేయాల్సిన రౌండ్ సీల్‘ ను ప్రైవేట్ వ్యక్తులు తమ స్వంత కాగితాలపై వేసుకోవడం చట్టరీత్యా నేరమని ధ్వజమెత్తారు. సర్పంచ్ ఎటువంటి అధికారిక తీర్మానం చేయకుండానే ఈ కమిటీని ఎలా నియమిస్తారని ఆయన ప్రశ్నించారు.

అంకెల్లో మాయాజాలం చేస్తూ వింత ఖర్చులు పెట్టారని, జాతర ఆదాయంపై గ్రామస్తులు నిలదీయడంతో కమిటీ సభ్యులు విడుదల చేసిన లెక్కలు చూసి భక్తులు విస్తుపోతున్నారు.

మొత్తం ఆదాయం రూపాయలు 90,418

చూపిన ఖర్చులు రూపాయలు1,05,660

లోటు బడ్జెట్ రూపాయలు 15,242

ఈ ఖర్చుల జాబితాలో కారు కిరాయి రూపాయలు 6,700, పెట్రోల్ రూపాయలు 750, డీజే రూపాయలు 5,000, పోలీస్ స్టేషన్ పేరిట రూపాయలు 3,800 ఖర్చు చూపించడంపై వెంకటయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ ప్రాంగణంలో డీజే ఎందుకు? పోలీసుల పేరుతో లెక్కలు చూపడం ఏమిటి? భక్తుల సొమ్ముతో మేడారం వెళ్లి విందులు
చేసుకోవడం ఏ సంప్రదాయం?“ అని నిలదీశారు.

అధికార ముద్రను దొంగిలించి, భక్తుల నమ్మకాన్ని వమ్ము చేసిన కమిటీ చైర్మన్ చెవ్వల్ల స్వామి, సభ్యులు , వారికి సహకరించిన సర్పంచ్‌పై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 5వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసినా, కేసు నమోదులో జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల తీరుపై నరకుడు వెంకటయ్య అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వెంకటయ్య కోరారు.

# మత సామరస్యానికి ప్రతీక రంజాన్

## ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్



**వేలేరు,/హనుమకొండ బ్యూరో మార్చి 7 (జర్నలిస్ట్ వార్త):** మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే పవిత్ర రంజాన్ పండుగ సమాజంలో ఐక్యతను పెంపొందిస్తుందని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ అన్నారు. శనివారం వేలేరు మండల కేంద్రంలోని మసీదులో ముస్లిం మత పెద్దలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం, రాష్ట్రం, వేలేరు ప్రాంతం సస్యశ్యామలంగా ఉండాలని భగవంతుడైన అల్లాను భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. గత ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీల రంజాన్ పండుగకు, క్రైస్తవుల క్రిస్మస్ వేడుకలకు, హిందువుల బతుకమ్మ పండుగ సందర్భంగా నూతన వస్త్రాలను పంపిణీ చేయడం జరిగిందని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం ఆ సంప్రదాయాలను విస్మరిస్తోందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గుండ్రెడ్డి రాజేశ్వర్ రెడ్డి, మలికిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, గుజ్జుల శిరీష్ రెడ్డి, సర్పంచులు జోడుముంతల కిరణ్, బత్తుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కాయిత మాధవ రెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యుడు జానీ, గోవింద సురేష్, పోలు తిరుపతి, కొలిపాక వెంకటేష్, సూత్రపు సంపత్, జోగు ప్రసాదు పాల్గొన్నారు. అలాగే ముస్లిం మత పెద్దలు అంకుషావలి, బాబుమియా, జావీద్ పాషా, ఎం.డి. ఫరూక్, ఏలూరి కరుణాకర్, దర్గా కమిటీ అధ్యక్షుడు ఎం.ఎస్. షరీఫ్ తదితరులు హాజరయ్యారు.

# వేద మంత్రోచ్చారణల మధ్య కొనసాగుతున్న ప్రతిష్టాపన మహోత్సవాలు

## సిద్దేశ్వర మహారాజ్ రాకతో మరింత వైభవం సంతరించుకోనున్న వేడుకలు





**భీమదేవరపల్లి/మార్చి7 (జర్నలిస్ట్ వార్త):**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముత్తారం గ్రామంలో ఉన్న శ్రీ త్రికూటేశ్వరాలయంలో నిర్వహిస్తున్న నూతన విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు శనివారం రెండో రోజు ఘనంగా కొనసాగాయి. ఫాల్గుణ మాసం బహుళ చవితి సందర్భంగా యాగశాలలో పలు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఉదయం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య గణపతి హోమం, నవగ్రహ హోమం, మూలమంత్ర సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం ప్రతిష్టించనున్న దేవతామూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించి హోమగుండాలలో ప్రత్యేక హోమాలు చేశారు. ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో కిక్కిరిసి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మహిళల కోసం సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారికి కుంకుమార్చన చేసి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ధాన్యదివాసం, ఫలపుష్పాదివాస కార్యక్రమాలను కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ప్రతిష్టాపన మహోత్సవాలు గ్రామంలో భక్తి వాతావరణాన్ని నెలకొల్పుతున్నాయి. ఈ నూతన విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవానికి సిద్దిపేట జిల్లా అనంతసాగర్ సిద్ధాశ్రమం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ రాజయోగి సిద్ధేశ్వర మహారాజ్ హాజరుకానున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో సాంఘిక సంక్షేమ అధికారికి గాయాలు




**ఖమ్మం/మార్చి 7 (జర్నలిస్ట్ వార్త):**
ఖమ్మం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారికి గాయాలయ్యాయి. జిల్లాకు చెందిన సత్తుపల్లి ఏఎస్ఈఓ కార్యాలయంలో పనిచేస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ అధికారి టి. బాలకృష్ణ (44) శనివారం తనికెళ్ల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. అధికారిక విధి నిర్వహణలో భాగంగా వైరాకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. ఘటన సమాచారం అందుకున్న వెంటనే జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కేసగాని రాజశేఖర్ గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన బాలకృష్ణను స్వయంగా వైరా ఏరియా ఆసుపత్రికి తరలించి తక్షణ వైద్య చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

# పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ ఆరోపణలు

**అనుమతులు లేకుండానే కోళ్ల ఫారమ్ నిర్మాణం? -నకిలీ పత్రాలతో విద్యుత్ అనుమతులపై సందేహాలు**





**వేలేరు/హనుమ కొండ బ్యూరో మార్చి 7 (జర్నలిస్ట్ వార్త):** వేలేరు మండలంలోని పీచర గ్రామంలో పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ జరిగిందనే ఆరోపణలతో కోళ్ల ఫారమ్ నిర్మాణం వివాదాస్పదంగా మారింది. ఈ వ్యవహారంపై పీచర గ్రామపంచాయితీ కార్యదర్శి కె.రాజిరెడ్డి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.గ్రామానికి చెందిన గొల్లెన రాజయ్య తండ్రి బాలయ్య పీచర గ్రామ శివారులోని సర్వే నంబర్ 46/A/1/2 (రిజి.నెం.2397/2025) భూమిలో ఫౌల్ట్రీ ఫామ్ నిర్మాణం చేపట్టేందుకు గ్రామపంచాయితీ నుంచి నిరభ్యంతర పత్రం పొందినట్లు పత్రాలు సమర్పించినట్లు సమాచారం. అయితే ఆ పత్రాల్లో ఉన్న సంతకం తనది కాదని, సంతకం ఫోర్జరీ జరిగి ఉండొచ్చని కార్యదర్శి రాజిరెడ్డి అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయితీ కార్యాలయం నుంచి అధికారికంగా ఎలాంటి నిరభ్యంతర పత్రం జారీ కాలేదని చెప్పారు. తన సంతకాన్ని దుర్వినియోగం చేసి పత్రాలు సృష్టించి ఉండవచ్చనే అనుమానంతోనే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ పత్రాల ఆధారంగా బ్యాంక్ రుణం పొందినట్లు, అలాగే విద్యుత్ శాఖ నుంచి అనుమతులు తీసుకున్నట్లు సమాచారం అందిందని తెలిపారు.

**పూర్తిస్థాయి దర్యాప్తు కోరుతున్న గ్రామస్తులు**

ఇలాంటి సంతకాల ఫోర్జరీకి సంబంధించిన ఘటనలు గతంలో కూడా వెలుగులోకి వచ్చినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అందువల్ల ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపి నిజానిజాలు వెలుగులోకి తేవాలని వారు కోరుతున్నారు.

**విద్యుత్ అనుమతులపై చర్చ**

కోళ్ల ఫారమ్ నిర్మాణానికి విద్యుత్ మంజూరు విషయంలో సరైన పత్రాలు పరిశీలించారా అనే అంశంపై గ్రామంలో చర్చ కొనసాగుతోంది. ఈ అంశంపై సంబంధిత శాఖలు విచారణ చేపట్టి స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టిన అనంతరం పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## మహిళా దినోత్సవాన కొత్తపేటలో మహిళా ఉద్యోగులకు ఘన సన్మానం..!



**బయ్యారం/మార్చి 7.(జర్నలిస్ట్ వార్త);**బయ్యారం మండలం కొత్తపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో మహిళా వార్డు సభ్యులను,సూపర్ వైజర్లను,ఏఎన్ఎం అంగన్వాడి టీచర్లు,హెల్పర్స్ ను పంచాయతీ మహిళా సిబ్బంది నీ సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం మహిళలకు సమాన హక్కులను కల్పించిందన్నారు.మహిళలు పురుషులతో పోటీపడి అన్ని రంగాల్లో రాణించడం అభినందనీయం అని తెలిపారు.

## మార్చి 10న భీమదేవరపల్లిలో మంత్రి సమీక్ష సమావేశం

**యాక్షన్ ప్లాన్‌తో హాజరుకావాలని అధికారులకు సూచన**




**భీమదేవరపల్లి/మార్చి7 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామంలోని రైతు వేదికలో మార్చి 10, 2026 మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వీరేశం తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు తమ తమ శాఖలకు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌తో హాజరుకావాలని సూచించారు. సంబంధిత యాక్షన్ ప్లాన్ సాఫ్ట్ కాపీలను ముందుగా ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించాలని కోరారు. అదేవిధంగా పంచాయతీ కార్యదర్శులు తమ గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లకు ఈ సమావేశంపై సమాచారం తెలియజేసి హాజరు కావాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కల్పనా సునీల్ నాయక్.



**బయ్యారం/మార్చి 7(జర్నలిస్ట్ వార్త);**
బయ్యారం మేజర్ గ్రామ పంచాయతీకీ చెందిన రామగిరి వెంకన్న అనారోగ్య కారణంతో శుక్రవారం రాత్రి మృతిచెందారు.విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ బయ్యారం మండల నాయకులు అజ్మీర కల్పనా సునీల్ నాయక్ రామగిరి వెంకన్న మృతదేహన్ని పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి వారి కుటుంబానికి ఆర్థిక సహాయంగా అందించారు.వారి కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నీలారపు సంపత్ యాదవ్,కశనబోయిన సతీష్,కీర్తి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకన్న మృతి హమాలీ యూనియన్ కీ తీరని లోటు.



**బయ్యారం/మార్చి 7.(జర్నలిస్ట్ వార్త):**
బయ్యారం మండల సిఐటియు హమాలీ కామ్రేడ్ రామగిరి వెంకన్న అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు.వెంకన్న కుటుంబ సభ్యులకు సిఐటియు మండల కన్వీనర్ వల్లాల వెంకన్న,కో కన్వీనర్ అంగిరేకుల నాగేశ్వరరావు తమ ప్రగాఢ సానుభూతి తెలుపుతూ మృతదేహం పై ఎర్రజెండా కప్పి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు.వెంకన్న మరణం సిఐటియు సంఘానికి వారి కుటుంబానికి తీరని లోటని సిఐటియు మండల కన్వీనర్ వల్లల వెంకన్న అన్నారు.ఈ కార్యక్రమంలో హమాలీ కామ్రేడ్స్ వెన్ను మోహన్,రాయబారం అప్పయ్య, వేముల సోమిరెడ్డి,నాగయ్య,రాము, సురేష్,రామిరెడ్డి,అంజయ్య,సైదులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవ సందర్భంగా పలువురికి సన్మానం.

**-పిఆర్ టియు స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ గాయత్రి.**



**బయ్యారం/మార్చి 7(జర్నలిస్ట్ వార్త);**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బాలికల ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి మండల వ్యాప్తంగా వివిధ రంగాలలో విశేష కృషి చేసిన అంగన్వాడీ టీచర్ అమల,వర్కర్ కల్పన, కరాటే టీచర్ దివ్య,ఎల్లమ్మ, ఉపేంద్ర, పద్మ, ఉప్పలమ్మా, కోటమ్మ, టైలర్ సుభద్రతో పాటు ఆర్టిసి కండక్టర్ నుపిఆర్ టియు స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ యద్దనపూడి గాయత్రి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.మహిళల సంక్షేమం,సాధికారతను ఈ సందర్భంగా వారు కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఎచ్ఎం లక్ష్మనరావు,రమణమ్మ,సునీత, కరుణ,లావణ్య,మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

## టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలి: చేపూరి వినోద్



**స్టేషన్ ఘన్‌పూర్/మార్చి7 (జర్నలిస్ట్ వార్త):** హైదరాబాద్‌లోని గాంధీభవన్లో ఈ నెలలో జరగనున్న టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఉమ్మడి జిల్లా నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా విజయవంతం చేయాలని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి చేపూరి వినోద్ పిలుపునిచ్చారు. సమావేశం ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా వచ్చిన టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను ఈ సందర్భంగా వినోద్ ఘనంగా సన్మానించారు.సమావేశం గాంధీభవన్‌లో డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధ్యక్షతన ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యవర్గ భేటీ జరగనుందన్నారు.ముఖ్య అతిథిఏఐసీసీ ఎస్సీ విభాగం జాతీయ అధ్యక్షులు రాజేంద్రపాల్ గౌతమ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షులు తప్పనిసరిగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముత్తారం ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛత కార్యక్రమం





**భీమదేవరపల్లి/మార్చి7 (జర్నలిస్ట్ వార్త):**
ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఊరడి భారతి జైపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ మాట్ల హరికుమార్, పంచాయతీ కార్యదర్శి సంపత్ కుమార్, వార్డు సభ్యులు కొర్ర తిరుపతి, పార్నందుల నవిత, రేణికుంట్ల సందీప్, దొంద మౌనిక పాల్గొన్నారు. వారు పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, పిల్లలకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించి శుభ్రపరిచారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే పరిశుభ్రతను పాటించాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రియదర్శిని, ఉపాధ్యాయులు రాజిరెడ్డి, మల్టిపర్పస్ వర్కర్లు ఫిలిప్, ప్రేమనందం, వెంకటమ్మ, వీరమ్మ, కొమురయ్య, సిబ్బంది లలిత తదితరులు పాల్గొన్నారు.

## చాగల్లు హైస్కూల్‌లో హక్కుల చట్టాలపై అవగాహన సదస్సు

**స్టేషన్ ఘన్పూర్/మార్చి 7(జర్నలిస్ట్ వార్త):**
హ్యూమన్ రైట్స్ సొసైటీ ఆధ్వర్యంలో స్టేషన్ ఘన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని చాగల్లు జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనగామ జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఈ. సుచరిత ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు హక్కుల చట్టాల పట్ల అవగాహన కల్పించారు.న్యాయ సలహాలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండటం విద్యార్థులకు ఎంతో అవసరమని జడ్జి వివరించారు.ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల మహేష్, బ్లాక్ శాఖ అధ్యక్షుడు డేవిడ్ .నారగోని సరిత గౌడ్, బట్టమేకల శివరాజ్, మారేడుపాక రమేష్, రాజ్ కుమార్ తదితర హ్యూమన్ రైట్స్ సొసైటీ ప్రతినిధులు ఈ సదస్సులో భాగస్వాములయ్యారు.

## పశువైద్య శిబిరం విజయవంతం



**తల్లాడ/మార్చి 7 (జర్నలిస్ట్ వార్త):**మండలంలోని బిల్లుపాడు గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరం విజయవంతంగా జరిగింది. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ ఎన్నిక కృష్ణవేణి నరసింహారావు ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణవేణి మాట్లాడుతూ రైతులకు పశుసంపద ఎంతో ముఖ్యమని, పశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. శిబిరంలో పశువులకు రక్తపరీక్షలు నిర్వహించడంతో పాటు దూడలకు నత్తల మందులు పంపిణీ చేసి, వివిధ వ్యాధులపై పరీక్షలు నిర్వహించారు. అవసరమైన పశువైద్య మందులను ఉచితంగా అందజేశారు.ఈ శిబిరం ద్వారా గ్రామంలోని పశువుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి రైతులకు వైద్య సలహాలు అందించామని వైద్యులు తెలిపారు. కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు, రైతులు చురుకుగా పాల్గొని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్లు ఎండి అన్వాస్, డాక్టర్ రుబానా, జె.వి.ఓలు నాగరాజు, వరలక్ష్మి, సూపర్వైజర్ శివకృష్ణ, గోపాల మిత్రులు టి. వెంకటేష్, నల్లగట్ల బాబురావు, పరిశివరావు, వెంకటేశ్వరావు, లక్ష్మణరావు, తిరుపతిరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్ర సాంకేతిక రంగంలో పర్వతగిరి ఆణిముత్యాలు

**ఇన్‌స్పైర్ అవార్డులకు గురుకుల విద్యార్థినుల ఎంపిక**

**రహదారి భద్రత, సాగు సంరక్షణే లక్ష్యంగా నూతన ఆవిష్కరణలు**

**మట్టిలో మాణిక్యాల్లా మెరిసిన గ్రామీణ ప్రతిభ**







వైస్ ప్రిన్సిపల్స్ ఎస్ స్వాతి.


ఉపాధ్యురాలు వి ఉషా

**పర్వతగిరి/మార్చి7(జర్నలిస్ట్ వార్త);** ఆలోచనకు పదును పెడితే అద్భుతాలు సృష్టించవచ్చని పర్వతగిరి విద్యార్థినులు నిరూపించారు. పుస్తకాల్లోని జ్ఞానాన్ని కేవలం పరీక్షలకే పరిమితం చేయకుండా, సమాజంలో నిత్యం ఎదురయ్యే సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను వెతికి మట్టిలో మాణిక్యాలు అనిపించుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఇన్‌స్పైర్ అవార్డులకు పర్వతగిరిలోని పీ.ఎం.శ్రీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల నుండి ఇద్దరు విద్యార్థినులు ఎంపికై జాతీయ స్థాయిలో తమ ముద్ర వేశారు. నేటి కాలంలో రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా కొండ ప్రాంతాలు, తీవ్రమైన మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రాణాంతక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా విద్యార్థిని ఎస్. విక్షిత, గైడ్ ఉపాధ్యాయురాలు ఎస్. స్వాతి పర్యవేక్షణలో స్మార్ట్ బ్లైండ్ స్పాట్ సమీప హెచ్చరిక వ్యవస్థను రూపొందించారు. మలుపుల వద్ద వాహనం వస్తున్నప్పుడు ఈ వ్యవస్థ సెన్సార్ల ద్వారా గుర్తించి ముందస్తుగా హెచ్చరికలు జారీ చేస్తుంది.

దీనివల్ల డ్రైవర్లు అప్రమత్తమై వాహన వేగాన్ని తగ్గించి ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో పొలాల వద్ద పాములు, విష కీటకాల బెడద అధికం. రసాయనాలు వాడకుండానే వీటిని నివారించేలా విద్యార్థిని బి. హారిక, గైడ్ ఉపాధ్యాయురాలు వి. ఉష మార్గదర్శకత్వంలో ఒక వినూత్న పరికరాన్ని సిద్ధం చేశారు. ఇది పూర్తిగా సౌరశక్తితో పనిచేస్తుంది. రైతులకు అదనపు ఖర్చు ఉండదు. శబ్ద తరంగాలు లేదా వైబ్రేషన్ల ద్వారా పాములను, కీటకాలను పంట పొలాలకు దూరంగా ఉంచి రైతుల ప్రాణాలను, పంటలను కాపాడుతుంది. ఇది పర్యావరణహితమైన ఆవిష్కరణ కావడం విశేషం. విద్యార్థినుల ఈ ఘనతతో పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థినులకు మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు.

### గురువుల ప్రోత్సాహమే ఈ విజయం


**ప్రిన్సిపల్ పి. అపర్ణ**

మా విద్యార్థినులు జాతీయ స్థాయి అవార్డులకు ఎంపిక కావడం గర్వంగా ఉంది. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి, వారికి ఉపాధ్యాయులు సరైన మార్గదర్శకత్వం అందించడం వల్లే ఈ అద్భుత ఆవిష్కరణలు సాధ్యమయ్యాయి. గ్రామీణ విద్యార్థినులు శాస్త్రవేత్తలుగా ఎదగడం ఈ ప్రాంతానికి గర్వకారణమన్నారు.


ఎస్ వీక్షిత


బి హారిక

# అనాదిగా మహిళ పరమ పూజ్యనీయం




**మార్చి 7.(జర్నలిస్ట్ వార్త):**

భారతీయ సంస్కృతిలోనే స్త్రీలకు అత్యంత గౌరవం ఉంది. అనాదిగా స్త్రీని పరమ పూజ్యనీయంగా చూసే వారు. అందుకేనేమో మన ఇతిహాసంలో మహిళనే ఎక్కువగా గౌరవించేవారు. సతీ అనసూయ, సతీ అరుంధతి, సీత, సావిత్రి, ద్రౌపది ఇలా గౌరవప్రదమైన స్థానాల్లో స్రీలు ఉండేవారు. అమ్మవారిగా కూడా కాళీ, లక్ష్మి, సరస్వతి, దుర్గా ఇలా పూజలు నిర్వహించేవారం. నదులకు కూడా గంగా, యమున, సరస్వతి, గోదావరి, కృష్ణ, పేర్లతో గౌరవించుకున్నాం. ఇంతటి ఉత్కృష్టత కలగిన మన చరిత్ర నుంచి మనం పక్కకు తప్పుకున్నామా అన్న బాధ కలుగుతోంది. స్త్రీని స్త్రీగా కాకుండా ఆటవస్తువుగా, భోగవస్తువుగా చూస్తున్న తీరుకు తలదించుకోవాలి. స్త్రీకి ఇప్పుడు గౌరవంగా చేస్తున్నందుకు సిగ్గుపడాలి. యత్రనార్యంతు పూజ్యంతే.. అన్న ఆర్యోక్తికి భిన్నంగా మన ప్రవర్తన, మన నడత మారడం ఆందోళనకరం. ప్రతియేటా అంతర్జాతీయ మహిళా దినోత్సవారుల జరుపుకుంటున్నా మార్పులు రావడం లేదు. సమాజంలో మృగాళ్లు విజృంభిస్తున్నారు. కఠిన చర్యలు తీసుకోక పోవడం కూడా ఓ కారణం. మన సమాజం గతంలో ఇచ్చిన గౌరవాన్ని మళ్లీ పునరుద్ధరించుకోవాల్సి ఉంది. మహిళలకు అన్నరంగాల్లో పెద్దపీట వేసేలా ప్రతిన తీసుకోవాలి. ఏటా అంతర్జాతీయ దినోత్సవాలను కాకుండా నిత్యం మనమంతా మహిళలను గౌరవించేలా మన సమాజాన్ని మార్చుకోవాలి. మొదట అంతర్జాతీయ మహిళా శ్రామిక దినోత్సవంగా పిలిచేవారు. వివిధ ప్రాంతాలలో ఈ ఆచరణ మహిళలకు గౌరవం, గుర్తింపు నిస్తోంది. ప్రేమల గురించిన సాధారణ ఉత్సవం నుండి మహిళల ఆర్థిక, రాజకీయ, సామాజిక సాధనల ఉత్సవంగా వుంటుంది. సామ్యవాద రాజకీయ ఘటనగా ప్రారంభమై, వివిధ దేశాల్లో, ముఖ్యంగా తూర్పు ఐరోపా, రష్యా, పూర్వ సొవియట్ సమూహపు దేశాల సంస్కృతుల్లో భాగమైంది. ఇంకొన్ని ప్రాంతాలలో ఐక్యరాజ్యసమితి ఉద్దేశించిన విధంగా రాజకీయ, మానవీయ హక్కులు బలంగా వుండి ప్రపంచవ్యాప్తంగా మహిళల రాజకీయ, సామాజికహక్కుల పోరాటంపై జాగృతి పెంచే విధంగా జరుపుతారు. ఈ రోజున కొంతమంది వంకాయ రంగు రిబ్బనులు ధరిస్తారు. ఓ వ్యక్తి జీవితంలో స్త్రీ చాలా పాత్రలు పోషిస్తుంది. తల్లి మొదలు, చెల్లి, భార్య, గురువు ఇలా ఎన్నో బాధ్యతలను ఆమె అలవోకగా చేయగలదు. ఆమెలోని గొప్పదనం ఏంటంటే ఓ వైపు ఇంటిని చక్కబెడుతూనే మరోవైపు సంఘంలోనూ ఎన్నో పాత్రల్లో బాధ్యతగా ఇమిడి పోతోంది. సమాజంలో మగవారితో సమానంగా టీచర్, ఇంజనీర్, పైలెట్ వంటి బాధ్యతలను కూడా ఆమె స్వీకరించి వందశాతం వాటికి న్యాయం చేస్తుంది. అంతెందుకు యుద్ధరంగంలోనూ మహిళ సమర్థంగా తన బాధ్యతలను నిర్వహిస్తోంది. అంటే ఆమెకు ప్రోత్సాహం అందిస్తే ..ఎంతటి పాత్రను అయినా అవలీలగా పోషించే శక్తి మహిళ సొంతం. నేటి కాలంలో స్త్రీలు సాధించిన విజయాలు నిజంగా ఆకాశాన్నంటాయి. వీటన్నింటికి ప్రతీకగా ప్రపంచంలోని మహిళల కోసం 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం'ని ఏర్పాటు చేశారు. ముందుకాలంతో పోల్చితే రోజురోజుకి మహిళలు ముందుకు సాగుతున్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో వారి పాత్ర కీలకం. ప్రతి సంవత్సరం మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుగుతుంది. ఈ రోజున వారు సాధించిన విజయాలకి గుర్తుగా వారిని గౌరవించే రోజు. నేడు అన్ని రంగాల్లోనూ ముందున్న మహిళలు.. తమ అద్భుత తెలివి, ఆలోచించే విధానంతో రోజురోజుకి పురోగతి సాధిస్తున్నారు. 1909 ఫిబ్రవరి 28న జాం న్యూయార్క్ నగరంలో అమెరికన్ సోషలిస్ట్ పార్టీ జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంది. కార్మిక కార్యకర్త థెరిసా మల్కెయిల్ నగరంలోని రెడీమెడ్ గార్మెంట్స్ కార్మికులపై జరుగుతున్న అణచివేతని ఖండిస్తూ ఈ దినోత్సవాన్ని ప్రారంభించారు. దీని ప్రాముఖ్యతని చూసి ముగ్ధులైన అమెరికన్ సోషలిస్ట్ నాయకులు మహిళా దినోత్సవాన్ని ఎందుకు జరుపుకోవాల్సిన అవసరం ఉందో చెప్పారు. కానీ, ఆ టైమ్‌లో ప్రత్యేకమైన రోజుని అనుకోలేదు. ఈ నేపథ్యంలో 1975, 1977లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఐరాస నిర్వహించింది. సంస్థ సంబరాలు ప్రారంభించి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించింది. ఈ రోజున మహిళల హక్కులని కాపాడి, వారు శాంతియుతంగా జీవించేందుకు చర్యలు తీసుకోవాలని కట్టుబడి ఉంది. లింగ సమానత్వాన్ని జరుపుకుంటారు. ఈ రోజున వివిధ రంగాల్లో విజయాలు సాధించిన మహిళల్ని గుర్తించి వారికి గౌరవిస్తారు. సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక కార్యక్రమాల్లో స్త్రీ, పురుషులు సమానమని చెప్పడమే ముఖ్య ఉద్దేశ్యం. ఇక ఈ రోజున ప్రత్యేకమైన కొన్ని రంగుల దుస్తులు కూడా ధరిస్తారు. ఎక్కువగా ఊదారంగు(పర్పుల్), ఆకుపచ్చ, తెలుపు రంగుల వస్త్రాలని ధరిస్తారు. ఇక్కడ పర్పుల్ అంటే ఊదా రంగా న్యాయ, గౌరవానికి సూచనగా, ఆకుపచ్చ రంగు హామిని ఇస్తుంది. ఇక తెలుపు స్వచ్ఛతకి సూచనగా ధరిస్తారు. అదే విధంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏ దేశానికి, సంస్థ, సంఘానికి మాత్రమే పరిమితం కాలేదు. ప్రపంచ వ్యాప్తంగా దీనిని జరుపుకుంటారు. అమ్మ, గురువు, అక్క, చెల్లి, భార్య, ఇలాంటి ఎన్నో ముఖ్య పాత్రలు పోషిస్తున్న వారందరికీ ఈ రోజున కృతజ్ఞతలు అదే విధంగా అభినందనలు తెలపడం మన బాధ్యత. విధి. దీని వల్ల వారు అందించిన సేవలని మీరు గుర్తించినట్లుగా అవుతుంది. అందుకే మనమంతా మాతృమూర్తి అయిన స్త్రీలను గౌరవించడం అలవాటు చేసుకోవాలి. ఇంటినుంచే ఈ ఆచారం రావాలి. సమాజంలో ఆమె గౌరవాన్ని కాపాడాలి. అప్పుడే మన సంస్కృతిని ముందుకు తీసుకుని పోగలం. అంతేగాకుదు మహిళ లేకుంటే మనుగడ లేదని, సృష్టి లేదని గుర్తించాలి.

